భారీ వృక్షాల తొలగింపుపై పట్టింపేదీ: సిపిఎం

ప్రజాశక్తి-చింతపల్లి: గ్రామాలకు రోడ్లు వేయడానికి ఫారెస్ట్ చట్టం అడ్డు వస్తుందని చెపుతున్న ఫారెస్ట్ అధికారులు ఎన్‌హెచ్ ఫైవ్ పేరుతో రోడ్డు పక్కన ఉన్న అనేక వృక్షాలు తొలగిస్తుంటే ఎందుకు ఆటంకం పరచలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ ప్రశ్నించారు. ఎన్‌హెచ్5 రోడ్డు విస్తరణలో భాగంగా పెద్ద గడ్డలు వద్ద భారీ వృక్షాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ,రోడ్డు పక్కన ఉన్న పెద్ద వృక్షాలు కొట్టేస్తుంటే ఫారెస్ట్ అధికారులు ఏమి సమాధానం చెపుతారన్నారు.ఫారెస్ట్ చట్టాలు ఉన్నా లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఇంత వృక్షం పెరగడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో పర్యావరణ అధికారులు చెప్పాలని కోరారు.

పరిశీలిస్తున్న చిన్నయ్య పడాల్

మాతృ భాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలని..

ఆదివాసీ గిరిజన సంఘం ధర్నా

ప్రజాశక్తి -పాడేరు: ఆదివాసీ మాతృ భాష విద్య వాలంటర్లను తక్షణమే రెన్యువల్ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాడేరులో ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయం నుండి ఐటిడిఏ వరకు ర్యాలీ నిర్వహించారు. గేటు దగ్గర పోలీసులు అడ్డుకోవడంతో నినాదాలతో హోరెత్తించారు. అనంతరం జరిగిన ధర్నాలో ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ, అక్షరాస్యత పెంచడం, నైపుణ్యత సాధించడంలో ఆదివాసీ మాతృ భాష విద్య వాలంటీర్లు పాత్ర కీలకమని తెలిపారు. దేశవ్యాప్తంగా 10 వేల స్కూళ్లను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1400 పాఠశాలల్లో మాత భాష విద్య బోధన ప్రారంభించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు.మాతృభాషా వాలంటీర్లను రెన్యువల్ చేసే పద్ధతులు పాలకులు మార్చుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమశాఖ, ప్రభుత్వ, మండల పరిషత్ స్కూల్స్ లో స్థానిక ఆదివాసీ 'మాతృభాష విద్యా బోధన కోసం స్థానిక యువతి యువకులను రాష్ట్ర ప్రభుత్వం సుమారు 1327 మందిని 2023 - 24 విద్యా సంవత్సరంకు గాను పాఠశాల విద్యా కమిటీ ద్వారా నియమించిందని తెలిపారు. కొద్దిగా నిధులు కేటాయించారని, అందుకే ఫిబ్రవరి 29 వరకే కాల పరిమితం చేశారని ఆయన మండిపడ్డారు. తక్షణమే మార్చి, ఏప్రిల్ నెలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. డైట్, డిగ్రీ, ఇంటర్ మీడియట్ ఉత్తీర్ణులైన ఉన్నత విద్యావంతులు బోధించడంతో ప్రాథమిక విద్యలో నాణ్యత, నైపుణ్యత పెరిగి, డ్రాపౌట్స్ సంఖ్య తగ్గిందని తెలిపారు. ఆదివాసీ ప్రజల్లో జీవన ప్రమాణాలు పెరగడంతో పాటు భాహ్య ప్రపంచం తో అనుసంధానం పెరిగిందన్నారు. మాతృభాష బహుభాష ఆధారిత విద్యా బోధకులను కేంద్ర ప్రభుత్వం శాశ్వతంగా కొనసాగేంచేలా ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత అప్పలనర్స

కలెక్టర్‌కు వినతి

ఆదివాసీ మాతృ భాష విద్య వాలంటీర్లు రెన్యువల్ చేయాలనీ ఐటిడిఏలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, పాడేరు ఐ.టి.డి.ఏ పి. ఓ వినతి పత్రాన్ని సమర్పించారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌తో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సర్బు నాయుడు, చంద్రయ్య, వీరయ్య, గణస్, కుమారి, రమేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కిడారికి యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి-అనంతగిరి: ఉపాధ్యాయుల సమస్య లను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ కు అల్లూరి సీతారామరాజు జిల్లా యుటిఎఫ్ నేతలుశుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు.పాత పెన్షన్ విధానం అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి దేముడు, ఉమ్మడి జిల్లా పూర్వ సహ అధ్యక్షులు రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి సింహాచలం, కార్య వర్గ సభ్యుడు పి.రామచందరావులు కోరారు.ప్రభుత్వంపై ఒత్తిడికు తీసుకువచ్చేందుకు ఉపాధ్యాయులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

పశుసంవర్ధక శాఖ జిల్లా డైరెక్టర్‌గా శ్రీరాములు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మాజీ జెడ్పిటిసి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు మండ్యాగురు శ్రీరాములును అల్లూరి జిల్లా పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. స్థానిక అరకు ఎమ్మెల్యే పాల్గుణ శుక్రవారం మండల కేంద్రంలో సందర్శించి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీనియర్లకు ఉన్నత పదవులు కల్పించడమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసి 2014లోనూ మరోమారు జెడ్పిటిసిగా ఎన్నికై జిల్లా పదవులు దక్కడం సంతోషకరమని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, కించుమండ ఎంపీటీసీజి విజయ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి మండ్యాగురు కుజ్జమ్మ పాల్గొన్నారు.

శ్రీరాములును సత్కరిస్తున్న ఎమ్మెల్యే

జాఫ్రా కొనుగోలుకు చర్యలు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన రైతులు దళారుల దగ్గర మోసపోకుండా ఎక్కడికక్కడ జాఫ్రాలు కొనుగోలు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన రైతులు దళారుల దగ్గర మోసపోకుండా వారికి అవగాహన కల్పించి, జాఫ్రాలు కొనే విధంగా ఐదుగురితో టీమును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జాఫ్రా కొనుగోలు చేసేందుకు రంపచోడవరం ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి యల్.రాంబాబు, హార్టికల్చర్ అధికారి కె.చిట్టిబాబు, ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, వెలుగు డిపిఎం పరమేశ్వరరావు, హార్టికల్చర్ అధికారి ముత్తయ్యను గ్రామాల వారిగా నియమించినట్లు చెప్పారు. గతేడాది కిలో జాఫ్రా రూ.48 నుండి రూ.50కు ఇతరులకు రైతులు అమ్మేవారిని, ఈ ఏడాది కిలో జాఫ్రా రూ.150కు కొనుగోలుకు ఎస్ఎన్ ఆగ్రో ఎగ్జిమ్స్ తుని వెండర్‌లతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని తెలిపారు. 100 నుండి 200 మెట్రిక్ టన్నులు జాఫ్రా కొనే విధంగా లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. తూకాలలో రైతులు మోస పోకుండా డిజిటల్ కాటాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కొనుగోలు చేసిన జాఫ్రా తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏజెన్సీలో జీడిపిక్కలు, పసుపు, చింతపండు ఈ ఏడాది కొనుగోలు చేయాలని ఎస్ఎన్ ఆగ్రో ఎగ్జామ్స్ కంపెనీ ప్రతినిధి చంద్రశేఖర్‌ని కోరినట్లు చెప్పారు. చంద్రశేఖర్‌తో పాటు పిఏఓ యల్.రాంబాబు, ఉపాధి హామీ ఏపీడి జి.శ్రీనివాస్ రైతులు పండించిన జాఫ్రాను శుక్రవారం పరిశీలించి కొంతమేర కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో మారేడుమిల్లి ఎంపీడీవో వీర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

డిఇఒ బ్రహ్మజీరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

డిఇఒను కలిసిన ఉపాధ్యాయ సంఘాల నేతలు

ప్రజాశక్తి-రంపచోడవరం

అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యా శాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా రంపచోడవరం విచ్చేసిన బ్రహ్మజీరావును శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) తరుపున సంఘం జిల్లా అధ్యక్షులు విల్సన్ బాబు, కార్యదర్శి విశ్వరాజ్, రంపచోడవరం గౌరవాధ్యక్షులు టాల్‌స్టాయ్ బాబు, అధ్యక్షులు సనాతనబాబు, డిపి.లింగన్న డిఇఒను కలిసి సమస్యలను తెలియజేశారు. రాజవొమ్మంగి మండల విద్యాశాఖ అధికారి -1ను నియమించాలని, జీతాలు సమస్య లేకుండా చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎస్‌టియు నాయకులు లండా వేణుగోపాల్, ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎం.రాజేశ్వరరావు ఆధ్వర్యాన ఆయా సంఘాల నాయకులు డిఇఒను కలిసి ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డిఇఒకు తెలియజేశారు. వీరి వినతులపై డిఇఒ సానుకూలంగా స్పందించినట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు.

3న పల్స్ పోలియోను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-పాడేరు: 5 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ వచ్చే నెల 3న పోలియో చుక్కలు వేయాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో స్పందన అనంతరం కలెక్టర్ పల్స్ పోలియో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 1,15,860 మంది సున్నా నుండి ఐదు సంవత్సారాల వయసు పిల్లలు ఉన్నారని, వారందిరికీ శత శాతం పోలియో చుక్కలు వేయాలని సూచించారు. జిల్లాలో 4252 గ్రామాలలో 352 సబ్ సెంటర్లు ఉన్నాయని, 2402 పోలియో బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. అందుకు గాను 3723 ఇంటింటి బృందాలు ఏర్పాటు చేసామని, 77 సంచార వాహనాలు కేటాయించామని, 21 ట్రాన్సిట్ బృందాలు ఏర్పాటు చేసామని తెలిపారు. 9608 వేక్సినేటర్లను, 268 మంది సూపర్‌వైజర్లను నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జేసి భావన వశిష్ట్, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, డిఆర్ఓ లక్ష్మణమూర్తి, డిఎంహెచ్ఓ జమాల్ భాష పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయసునీత

యుటిఎఫ్ నేతకు నోటీసులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఉద్యోగ జేఏసీ పిలుపు మేరకు ఈనెల 27న చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనకుండా ముందస్తుగా అల్లూరి జిల్లా యూటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వి మహేశ్వరరావుకు శుక్రవారం మండలంలోని అరకు సంత బయలులో నివాస గృహంలో పోలీసులు నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ, పోలీసులతో ఉద్యమాలను ఆపడం సరికాదన్నారు.

నోటీసు ఇస్తున్న పోలీస్

రోడ్డు నిర్మించాలని పాదయాత్ర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని పెదలబుడు మేజర్ పంచాయతీ లిటిగూడ గ్రామంలో రహదారి నిర్మాణం చేపట్టాలని సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గ్రామస్థులు శుక్రవారం లిటిగూడ నుండి స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు మాట్లడుతూ, రహదారి నిర్మాణం చేపట్టాలని ధర్నాలు చేసినా అధికారులు స్పందించ లేదని అందుకే పాద యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ఈ రోడ్డుకు సుమారు 45 లక్షలు వరకు నిధులు మంజూరు అయ్యాయని, గుత్తేదారుడు పనులు మధ్యలోనే ఆపేసారన్నారు. దీంతో తారు రోడ్డ లేక వర్షా కాలంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారులు అధ్వానంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, కనీసం మరమ్మతులు కూడా చేయలేదని విమర్శించారు. అధికారులు స్పందించకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, రమేష్, పురుషోత్తంచ, గోపి, రామన్న, కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

28 నుండి వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి- పెదబయలు : గోమాంగి పంచాయతీ కేంద్రంలో ఈనెల 28 నుండి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు స్థానిక స్టేషన్ హౌస్ అధికారి శుక్రవారం పేర్కొన్నారు. గోమాంగి పంచాయతీ పరిధిలో యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ టోర్నమెంట్ ఉపయోగ పడుతుందని, ఆసక్తి గల క్రీడాకారులు మహిళా పోలీసు వద్ద టీమ్‌ల పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ టోర్నమెంట్ లో విజేతలకు మొదటి బహుమతి రూ.25000, రెండవ రూ. 15000, మూడవ బహుమతి రూ.10.000 నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు.

26 నుండి ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు

ప్రజాశక్తి-పాడేరు : రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఈనెల 26వ తేదీ నుండి ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని ఎల్.డి.ఎం.ఎన్. రవితేజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు వచ్చే నెల 1వ తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు. హుకుంపేట, పెదబయలు మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తామన్నారు. డిజిటల్ బ్యాంకింగ్ పొదుపు పై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు.

కాంగ్రెస్ నేతల ఆందోళన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ప్రభుత్వం మినీ డీఎస్సీ విడుదల చేయడంపై మండలంలోని అరకు సంతబయలులో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పిసిసి ఢిల్లీ గేట్ సభ్యుడు చిన్నస్వామి మాట్లాడుతూ గిరిజనులకు కల్పించిన జీవో 3 కు చట్టబద్ధత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సుప్రీంకోర్టులో ఇప్పటివరకు వైసీపీ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయలేదని విమర్శించారు. జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి- పెదబయలు : తులబరింగి, చెక్కరాయి, మల్కారిపుట్టు పాఠశాలలను మండల విద్యాశాఖధి 2 గుమ్మా పుష్పవతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు.నాడు నేడు మధ్యాన భోజన పథకాన్ని పరిశీలించారు.ఇద్దరు ప్రధాన ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేసినట్లు మండల విద్యాశాఖధికారిని 2 పుష్పవతి పేర్కొన్నారు.

మహాలక్ష్మి నాయుడుకు ఘన సన్మానం

ప్రజాశక్తి- పాడేరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు టాబ్స్ ఉపయోగించి ప్రత్యేక విద్య అందించడంపై ఆంధ్ర ప్రదేశ్ సమగ్ర శిక్ష రాష్ట్ర కీ రిసోర్స్ పర్సన్, అనకాపల్లి జిల్లా మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడుని డిఈఓ పి.బ్రహ్మజీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష విద్య సహిత విద్యా విభాగం అధికారి డాక్టర్ వై. నరసింహం, జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం అధికారి భాస్కరరావులు ఘనంగా సన్మానించారు. జిల్లాలోని వివిధ మండలాల్లో భవిత కేంద్రాలలో పని చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులకు మహాలక్ష్మినాయుడు ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో కీ రిసోర్స్ పర్సన్ సునీల్ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న డిఇఒ, అధికారులు

సమ్మె ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలి

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి రంపచోడవరం

అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా పలు డిమాండ్లపై జరిగిన ఒప్పందాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యాన రంపచోడవరంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి ఒకరోజు శిక్షణా తరగతుల్లో సుబ్బరావమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంగన్వాడీలు 42 రోజుల పాటు విరోచిత పోరాటం చేసి అనేక డిమాండ్‌లు సాధించుకోవడం జరిగిందని తెలిపారు. సమ్మె కాలంలో మంత్రులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు యూనియన్ తరుపున వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. ఐసిడిఎస్, ఫైనాన్స్ అధికారులతో మంత్రి ఫోన్ ద్వారా మాట్లాడారని, తక్షణం సమ్మె కాలపు సమయానికి వేతనాలను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని బొత్స హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

జిఓ నెంబరు 47 సవరణ, కార్యకర్తలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌గా రూ.50 వేల నుంచి రూ.లక్షా 20వేలు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.20 వేల నుంచి రూ.60 వేలకు పెంచడం, 42 రోజుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించడం, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడం, అంగన్‌వాడీలు మృతి చెందితే మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు ఇవ్వడం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ప్రధాన మంత్రి బీమా పథకం అమలు, సాధికారత సర్వేలో ఉద్యోగులు అనే పదాన్ని తొలగించి అంగన్‌వాడీలకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడటం, సమ్మె కాలంలో అంగన్‌వాడీలపై పెట్టిన కేసులను ఎత్తివేయడం, అధికారులు, యూనియన్ నాయకులతో కమిటీ వేసి వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీల పెంపు, నాలుగు యాప్‌లను ఒకే యాప్ కింద మార్పు, రాష్ట్ర వ్యాప్తంగా వున్న 164 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ, సెలవులు, అర్హత కలిగిన అంగన్‌వాడీలకు ఇళ్ల స్థలాలు మంజూరు, అంగన్వాడీ హెల్పర్లకు వర్కర్లుగా ప్రమోషన్ తదితర సమ్మె కాలంలో ప్రభుత్వం అంగీకరించిన అన్ని అంశాల పరిష్కారం కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని మంత్రి బొత్సను కోరినట్లు తెలిపారు. యూనియన్ రంపచోడవరం జిల్లా అధ్యక్షురాలు ఎం.రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు రంపచోడవరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వాణిశ్రీ, పి.వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నిర్మల, నాయకులు కె.రామలక్ష్మి, కె.రాణి, కె.మంగయ్యమ్మ, కె వెంకట లక్ష్మి, బేబి, ప్రసూన, కె నాగదేవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

నత్తనడకన నాడు-నేడు పనులు

-పునాది దశలోనే ఆగిపోయిన పాఠశాల భవన నిర్మాణం
-గుడిసెలో తరగతుల నిర్వహణ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పథకం కింద పాఠశాల భవన నిర్మాణం ప్రారంభించి రెండేళ్లు దాటినా నేటికీ ఆ పనులు పూర్తి కాలేదు. మండలంలోని దొర చింతలపాలెం పంచాయతీ పరిధి ధారవాడ గ్రామంలో పాఠశాల భవన నిర్మాణానికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద రూ.20 లక్షలు మంజూరు చేసింది. భవన నిర్మాణానికి పునాదులు తీసి వదిలేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పనులను సైతం అధికారులు పట్టించుకోకుండా నీరుగారుస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా చూస్తుంటే నిధులు ఉన్నాయా? లేదా? అనే అనుమానం కలుగుతుందని పలువురు గ్రామస్తులు అంటున్నారు. పాఠశాలకు భవనం లేకపోవడంతో విద్యార్థులకు గుడిసెలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధారవాడ గ్రామంలో పాఠశాల భవన నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పునాది దశలోనే నిలిచిపోయిన ధారవాడ పాఠశాల భవనం

ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని ర్యాలీ

ప్రజాశక్తి-చింతూరు : ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని, వాటిని దుకాణదారులు వాడొద్దని, అడవులకు నిప్పు పెట్టొద్దని అనే నినాదాలతో పేగ పంచాయితీ యువత, లీడ్స్ సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం మండలంలోని ఏడుగురాళ్ళ పల్లి వారపు సంతలో ర్యాలీ నిర్వహించారు. సంత నుండి ప్లాస్టిక్ కవర్లు ఇంటికి తీసుకువెళ్ళి పడేయడం వల్ల పర్యావరణం, భూమి, నీరు కలుషితం అవుతుందని తెలిపారు. పడేసిన కవర్లను అవులు, మేకలు తిని అనారోగ్యానికి గురవుతున్నాయని పేర్కొన్నారు. జీవజాలనికి ముప్పు కలుగుతుందన్నారు. ఇప్పపువ్వు, తునికాకు కోసం అడవికి నిప్పుడు పెట్టవద్దని హితవు పలికారు. నెల రోజుల పాటు పేగ పంచాయితీలో ప్రతి గ్రామానికి వెళ్లి వీటిపై అవగాహన కల్గిస్తామని, ఇందులో పాల్గొన దల్చిన వారు 8500393477 నెంబరుకు ఫోన్ చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోడే శ్రీను, గోరం రాఘవ, తోడం సుమన్, నుప భద్రయ్య లిడ్స్ డైరెక్టర్ పాధర్ ప్రశాంత్, పోడియం ధన, లక్ష్మణ్, సోడే ప్రసాద్, పోడియం సురేష్ తదతరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ కేబుల్స్‌లో సాంకేతిక సమస్యలు

ప్రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలం సీలేరులో బిఎస్ఎన్ఎల్ ఓఎఫ్‌సి కేబుల్లో సాంకేతిక లోపాలు తలెత్తాయి. దీంతో సీలేరులో గురువారం సాయంత్రం సెల్ సేవలు మూగబోయాయి. నెట్‌వర్కు సేవలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. సెల్, నెట్‌వర్కు సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. బిఎస్ఎన్ఎల్ ఓఎఫ్‌సి కేబుల్‌లో సాంకేతిక లోపాలను సవరించి బిఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులో తేవాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఆలిండియా ట్రైబల్ యూత్ కన్వెన్షన్‌కు రవితేజ

ప్రజాశక్తి-కూనవరం : మహారాష్ట్రలోని ముంబైలో ఈ నెల 25న జరగనున్న షెడ్యూల్డ్ ట్రైబల్ యూత్ ఆలిండియా కన్వెన్షన్‌కు ఆంధ్ర ప్రదేశ్ నుండి ప్రతినిధిగా మండలానికి చెందిన యువ న్యాయవాది మడివి రవితేజ హాజరుకానున్నారు. దేశ వ్యాప్తంగా ఆదివాసీ ప్రజలు, యువజన సమస్యల మీద ఈ కన్వెన్షన్‌లో చర్చించనున్నారు. చిన్న వయస్సు నుండి నుండి విద్యార్థి, యువజన, ఆదివాసీల సమస్యలపై పని చేసిన అనుభవం ఉన్న రవితేజ జాతీయ స్థాయి సదస్సులో పాల్గొనడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

3న దారాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- సీలేరు : జికె.వీధి మండలంలోని దారాలమ్మ అమ్మవారి ఆలయం పునర్నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేశారు. ప్రస్తుత గుడిని ఈ నెల 29న తొలగించడం, మార్చి 3న నూతన గుడి నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారి శ్రీనివాసాచార్యులు, దారాలమ్మ గుడి సిద్ధాంతి ప్రసాద్ శుక్రవారం ముహూర్తం నిర్ణయించారు. దేవాదాయ శాఖ అధికారులు సిజిఎస్ ఫండ్ ద్వారా గుడి పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయడంతో కాంట్రాక్టర్ ఈ వారంలో గుడి పనులు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో సాంబశివరావు, ఇన్‌స్పెక్టర్ కృష్ణంరాజు, గొర్లె గణేశ్వరరాజు, మోపాడ నాగేశ్వరరావు, రెడ్డి రామారావు, మోహనరావు, రామ్మూర్తి, గడుతూరి గిరిబాబు, పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -సీలేరు : ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఓ ఎ.లక్ష్మీదేవి పేర్కొన్నారు. జీకే వీధి మండలం దారకొండ సెక్టార్ పరిధి మారుమూల గ్రామాల్లో శుక్రవారం లక్ష్మీదేవి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా దొరగుంది, దార్లగొంది గ్రామాల్లో గర్భిణులు, బాలింతలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. వారికి పలు సూచనలు చేశారు. సెక్టార్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాలు సందర్శించి చిన్నారులు, బాలింతలు గర్భిణులతో మాట్లాడారు. పౌష్టికాహారం క్రమం తప్పకుండా వినియోగించాలని సూచించారు. పోషకాహారాలన్నీ పంపిణీ చేయకపోతే అంగన్వాడీ సిబ్బందిపై చర్యలు తప్పని హెచ్చరించారు.

రైతులపై కాల్పుల పట్ల ఆగ్రహం

- అన్నదాతను కాల్చి చంపడం అమానుషం
- కేంద్ర హోం మంత్రి, హర్యానా ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి
- అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశ ప్రజలకు అన్నం పెడుతున్న రైతులపై హర్యానాలోని బిజెపి ప్రభుత్వం కాల్పులు జరిపించి రైతు శుభ్‌కరణ్ సింగ్‌ను పొట్టన పెట్టుకున్నందుకు హర్యానా ముఖ్యమంత్రి ఎంఎల్ కట్టర్, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రైతులపై కాల్పులు, హత్యకు నిరసనగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, ఎఐసిటియు జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి కె.ఈశ్వరరావు మాట్లాడుతూ, దేశ ప్రజలకు అన్నం పెట్టే రైతులు అప్పులు, అవమానాలు పాలై ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నేడు దేశంలో నెలకొనడానికి కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ విధానాలే కారణమన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం మూడు రైతు ప్రజా వ్యతిరేక నల్ల చట్టాలు తీసుకొస్తే వీటికి వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున ఢిల్లీలో ఉద్యమించారని, ఆ సందర్భంగా జరిగిన ఒప్పందంలో రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ పార్లమెంటులో చట్టం చేస్తామని మోడీ ప్రభుత్వం అంగీకరించి సంవత్సరాలు గడుస్తున్నా గిట్టుబాటు ధరల చట్టం చేయకపోవడంతో రైతులు చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని భగ్నం చేయడం కోసం శత్రు దేశాలతో యుద్ధం చేస్తున్నట్టు బిజెపి ప్రభుత్వం రైతులపై చేస్తోందన్నారు. ఈ అమానుషాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది రాజకీయ హత్య అన్నారు. దీనిపై 302 సెక్షన్ కింద కేసు నమోదు చేసి సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రైతు వ్యవసాయ గిట్టుబాటు ధర చట్టాన్ని తక్షణమే చేయాలని, రైతు సంఘాలు నాయకులతో చిత్తశుద్ధితో చర్చలు జరిపి వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులపై నిర్బంధం ఆపకపోతే మోడీ ప్రభుత్వానికి, బిజెపి పాలకులకు ప్రజలు తగిన శాస్తి చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బి.జగన్, పి.మణి, వి.కృష్ణారావు, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.మన్మథరావు, బిసిహెచ్ మసేన్, ఎస్‌కె రెహమాన్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, కె.సంతోష్ కుమార్, ఐద్వా జిల్లా నాయకులు కె.కుమారి, కె.సత్యనారాయణ, పి.గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ర్యాలీ మానవహారం

గ్రేటర్ విశాఖ బ్యూరో : రైతులపై కాల్పులకు నిరసనగా ఐద్వా కేంద్ర కమిటీ ఆధ్వర్యాన విశాఖ డాబాగార్డెన్స్‌లో శుక్రవారం సాయంత్రం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కాల్పులకు బాధ్యత వహిస్తూ మోడీ, అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు పికె. శ్రీమతి, మరియం ధావలే, కోశాధికారి పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి, ఆలిండియా నాయకులు సుజాత, కీర్తి సింగ్, సీమ, ప్రత్యతి, సుసంకోడి, ఇషితా, షబ్బాని తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: ఢిల్లీలో రైతులపై పోలీసు కాల్పులకు పాల్పడిన బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపాలని సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం నర్సీపట్నం ఎన్‌టిఆర్ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పండించిన పంటలకు కనీస మద్దతు ధర కావాలని కోరడమే నేరమన్నట్లు హర్యానా ప్రభుత్వం రైతుల ఉద్యమంపై ఉక్కుపాదం మోపడం సరికాదన్నారు. ఈ ఘటనను ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాసులబెల్లి లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి, రైతు సంఘం నాయకులు జి.గురుబాబు, మేకా సత్య నారాయణ, ఎం.రాజు బాబు, ఎన్. శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

అనకాపల్లి : కేంద్ర, హర్యానా బిజెపి ప్రభుత్వాలు రైతాంగం జరిపిన కాల్పులను ఖండిస్తూ శుక్రవారం అనకాపల్లి నాలుగు రోడ్ల కూడలి అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు, ఎఐటియుసి, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.శంకర్రావు, పి.ఎస్.వి.పరమేశ్వరరావు ఎ.రాజు, చలపతి, బి.సూరకణప్పారావు (సిఐటియు), వైఎస్ భద్రం, రాజాన దొరబాబు, నాయుడు మల్లికార్జునరావు, ముప్పిడి రామచంద్రరావు, ముక్కమాల చిన్ని, కోన లక్ష్మణ (ఎఐటియుసి), కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు, రెడ్డిపల్లి అప్పలరాజు, కోరిబిల్లి శంకర్రావు, వేచలపు కాసుబాబు బాబు, సరాల శెట్టి సత్యనారాయణ, పి. ఈశ్వర్రావు, మత్తర్తి సూరిబాబు, సూరిబాబు (రైతు సంఘం) పాల్గొన్నారు.

వి.ఆర్.పురం : రైతులపై కాల్పులకు నిరసనగా అల్లూరి జిల్లా వి.ఆర్.పురం మండలం రేఖపల్లి సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం ఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం నిరంకుశంగా దేశానికి అన్నం పెట్టే రైతులపై ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, నాయకులు పంకు సత్తిబాబు, కుంజ నాగిరెడ్డి, వడ్డది రమేష్, గుండెపూడి లక్ష్మణరావు, సిహెచ్ సుబ్బారావు, నాల్లారపు ప్రకాశరావు, సోడి మల్లయ్య పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నేతలు

అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు

నేరాలు ఘోరాలు

60 మద్యం బాటిళ్ల స్వాధీనం

ప్రజాశక్తి -మునగపాక : మండలంలోని మల్లవరం గ్రామంలో బెల్ట్ షాపుపై దాడి నిర్వహించి 60 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రసాదరావు తెలిపారు. బెల్ట్ షాపు నిర్వాహకుడ్ని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారు.

స్థల వివాదంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డు శివారు ప్రాంతమైన దారపాలెం, బీఆర్‌టిఎస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న స్థల వివాదంలో రెండు వర్గాల మధ్య ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే దారపాలెం, బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న సుమారు 60 సెంట్ల స్థలం ఉంది. ఈ స్థలం మాదంటే మాది అని రెండు వర్గాల మధ్య వివాదం జరుగుతుంది. రెండు రోజుల క్రితం ఒక వర్గం మంది మార్బుల్‌తో వచ్చి స్థలంలో ప్రధాన గేటు ఏర్పాటు చేసే నిర్మాణానికి పూనుకున్నారు. దీంతో ఆ స్థలంలో కొంత స్థలం నాదే అంటూ ఒక మహిళ ఆరిలోవ పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఆరిలోవ సిఐ గంగు గోవిందరావు తన సిబ్బందితో వెళ్ళి అక్కడ జరుగుతున్న పనులు ఆపించారు. రెండు వర్గాల మధ్య జరుగుతున్న వివాదాన్ని చినగదిలి తహసీల్దారు, ఆర్డీఓ కార్యాలయాలకు సమాచారాన్ని అందజేసారు. అంతవరకు ఇరు వర్గాల వారిని స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని సిఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జివిఎంసి ఏడోవార్డు నగరంపాలెం, కళానగర్‌కు చెందిన నాగోతి ఆనంద్ (31) శుక్రవారం మృతి చెందినట్లు ట్రాఫిక్ ఎసిపి ఎం.వెంకటరావు తెలిపారు. సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న ఆనంద్, ఈనెల 20న విధులకు వెళుతుండగా మార్గమధ్యలో ఎండాడ పోలీస్‌స్టేషన్ వద్ద లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆనంద్‌ను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డాడు. మృతుని భార్య కావ్య ప్రస్తుతం గర్భవతిగాను, కొడుకు ఉన్నారు. కావ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విక్టోరియా ఆసుపత్రిలో సోలార్ ప్లాంటు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలోని విక్టోరియా (ఘోష) ఆసుపత్రి విద్యుత్ అవసరాలను తీర్చే నిమిత్తం 80 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంటును జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం ప్రారంభించారు. సిఎస్ఆర్ కింద ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా కంపెనీ ఈ ప్లాంట్లను సమకూర్చగా జిల్లా కలెక్టర్ ప్రారంభించి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సోలార్ ప్లాంట్ ద్వారా నెలకు 8 వేల నుంచి 9 వేల యూనిట్ల విద్యుత్ వస్తుందని, దీని వల్ల ఆసుపత్రిలో ఇక నుంచి విద్యుత్ కొరత సమస్య ఉండదని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యాన్ని కలెక్టర్ అభినందించారు. ఆ కంపెనీ ద్వారా కెజిహెచ్, ప్రభుత్వ వసతి గృహాలు, ఇతర చోట్ల చేపట్టిన సేవా కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. విక్టోరియా ఆసుపత్రిలో కల్పించిన సౌకర్యాలను సమకూర్చేందుకు ఈ కంపెనీ ముందుకు రావటం హర్షణీయమన్నారు. అందరూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎం.రవీంద్రనాథ్, ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ హెచ్ఆర్ హెడ్ డిఎస్.వర్మ, ఇతర అధికారులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల సమస్యలపై మేయర్‌కు వినతి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : కాంట్రాక్టర్ల సమస్యలపై మార్చి 1వ తేదీ లోపు పరిష్కారం చూపకపోతే జివిఎంసి పరిధిలో జరుగుతున్న అన్ని పనులను ఆపాలని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ చేసిన ఏకగ్రీవ తీర్మాన ప్రతిని శుక్రవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారికి క్యాంపు కార్యాలయంలో అసోసియేషన్ సభ్యులు అందజేశారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ద్వారా చేసిన పనులకు ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని చేపట్టిన రూ.25.1 కోట్ల పనులకు, జి-20 కోసం చేసిన పనుల బకాయిలు, బస్సు షెల్టర్ల నిర్మాణాల చెల్లింపుల అంశాలను పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రంధి సాధురావు, ఉపాధ్యక్షులు పిఎస్.ప్రసాద్, పి.ఎ.రాజు, బి.రామానాయుడు, సలహాదారులు, వీరభద్రరావు, ఆర్ఎన్.నాయుడు, నాగరాజు, పూర్ణచంద్రరావు, ఆడిటర్ ఎస్.రవీంద్ర, జాయింట్ సెక్రటరీ పిల్లా సూరిబాబు, ఎంవి సత్యనారాయణ పాల్గొన్నారు.

అఖిల భారత ప్రధాన ఓడరేవుల కబడ్డీ ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : 39వ అఖిల భారత ప్రధాన ఓడరేవుల కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలు అక్కయ్యపాలెంలోని పోర్టు ఇండోర్ స్టేడియంలో శుక్రవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు పోటీలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలలో ప్రధాన ఓడరేవులకు సంబంధించి 8 టీమ్‌లు పాల్గొంటున్నాయి. క్రీడాకారులు శుక్రవారం కవాతును నిర్వహించారు. అనంతరం అఖిల భారత ప్రధాన ఓడరేవులకు సంబంధించిన కబడ్డీ చాంపియన్ షిప్ క్రీడా పతాకాన్ని అంగముత్తు ఆవిష్కరించారు . అనంతరం అంగముత్తు మాట్లాడుతూ, ప్రధాన ఓడరేవుల ఆధ్వర్యాన ఏటా చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయన్నారు. శుక్రవారం మొదటి మ్యాచ్‌లో అతిథ్య జట్టు విశాఖపట్నం పోర్టు అథారిటీ, రెండో మ్యాచ్‌లో చెన్నై పోర్టు అథారిటీ విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ అధికారులు పిఎల్ స్వామి, పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, ఆర్గనైజింగ్ కమిటి కార్యదర్శి ఎస్.శివకుమార్, విపిఎస్‌సి పోర్టు విభాగాధిపతులు, పాల్గొన్నారు.

రాజకీయ పెన్షన్ నిలిపేయాలి : వివి.లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : చట్టసభలకు ఎన్నికయ్యే రాజకీయ నాయకుల సేవకులకు ఎటువంటి పెన్షన్ ఇవ్వకూడదని, వారి పదవీకాలం ముగిసిన వెంటనే వారికి చెల్లించే అన్ని రకాల వేతనాలను నిలిపివేయాలని, పెన్షన్ ఉండకూడదని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీనారాయణ అన్నారు. జివిఎంసీ గాంధీ విగ్రహం వద్ద సంఘమిత్ర సోషల్ సర్వీసెస్ అధ్యక్షుడు సూరిబాబు ఆధ్వర్యాన యువకులు మంచి భవిష్యత్తు కోసం పంచ సమస్యలు పరిష్కారం చేయాలని రోజుకు ఒక సమస్యపై చర్చించడానికి అందరూ రావాలని కోరుతూ శాంతియుత దీక్ష నిర్వహిస్తున్నారు.

శుక్రవారంతో ఈ దీక్ష 5వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపేందుకు వచ్చిన వివి.లక్ష్మీనారాయణ మీడియాతో మాట్లాడారు. యువకుల భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా పాలకులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడంతోపాటు దేశ ప్రగతిలో వారు పాల్గొనేలా చూడాలన్నారు. యువకులు బాగుంటేనే దేశం బాగుంటుందని పేర్కొన్నారు. రైతన్న బాగుంటేనే అందరూ బాగుంటారని, అందుకే రైతు సంక్షేమానికి పాలకులు అన్ని రకాల తోడ్పాటు అందివ్వాలని కోరారు. మద్యపానాన్ని నిషేధించాలన్నారు. మహిళలపై లైంగిక దాడులను అరికట్టాలన్నారు. మానవ మృగాలను ఉరి తీయాలని డిమాండ్ చేశారు.

కబ్జాదారుల నుంచి స్థలాన్ని అప్పగించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం హరిపాలెం గ్రామంలో ఉన్న తన స్థలాన్ని కబ్జా చేసి, ఇబ్బంది పెడుతున్న వారి నుంచి రక్షణ కల్పించి, స్థలాన్ని అప్పగించాలని అల్లిపురంలో నివసిస్తున్న జర్నలిస్టు సూరిసెట్టి మల్లేశ్వరరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ, హరిపాలెం గ్రామంలో మూడు సెంట్లు ఇంటి స్థలం ఉందని, దానిని తన కుటుంబ అర్థికావసరాల దృష్ట్యా అమ్మకానికి యత్నించగా అదే గ్రామానికి చెందిన న్యాయవాది శరగడం రామప్పలనాయుడు, వైసిపి జెడ్‌పిటిసి భర్త శరగడం ప్రసాద్, వారి బంధువులు శరగడం సన్యాసి నాయుడు, కర్రి శ్రీనివాస్‌లను తన స్థలం మీదకు ఉసిగొల్పి తాను సొమ్ము బాకీ వున్నట్లు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి తనను హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

స్పెషల్ డిఎస్‌సిపై ఆర్డినెన్స్ చేయాలి

- కలెక్టర్‌కు ఆదివాసీ గిరిజన సంఘం వినతి

ప్రజాశక్తి-పాడేరు: ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సిపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చి, జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్, జిల్లా ఉపాధ్యక్షులు టి.కృష్ణారావు, హుకుంపేట మండల నాయకులు పి.లింగమూర్తి, ఆదివాసీ డిఎస్‌సి సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బత్తిరి నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవ 6100 పోస్టులకు డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేస్తే, ఎస్‌టిలకు 1025 పోస్టులకు గాను, ఐదవ షెడ్యూల్ ఏరియాలో 500 పోస్టులు కేటాయించారన్నారు. అయితే పాడేరు ఐటిడిఎ పరిధిలో ఏడు, రంపచోడవరం, చింతూరు. ఏజెన్సీలో 10, సీతంపేట ఏజెన్సీలో ఆరు, విఆర్‌పురంలో 8, మొత్తంగా కేవలం 38 పోస్టులు మాత్రమే కేటాయించడం దుర్మార్గమన్నారు. జిఒ3 రద్దుతో నిరుద్యోగ గిరిజన యువతకు తీవ్రనష్టం జరుగుతోందని, దీనిపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యలంఓ ఏజెన్సీలోని పోస్టులన్నీ జిఒ3కు అనుగుణంగా ఎస్‌టిలతోనే భర్తీకి వీలుగా స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు.

తోటికార్మికులకు స్ఫూర్తిగాశ్రీనివాస్

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి పారిశుధ్యం విభాగం ఆవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావు విధి నిర్వహణలో తన ప్రత్యేకతను చాటుకుంటూ వస్తున్నాడు. ఇప్పటికే సేవా కార్యక్రమాలతో పలువురి ప్రశంసలు, అభినందనలు అందుకున్న శ్రీనివాసరావు, శుక్రవారం 92వ వార్డు బాపూజీనగర్‌లో గెడ్డలలో పూడికతీత పనుల్లో తానూ ఒక కార్మికునిగా పలుగు పట్టి పాల్గొని, తోటి కార్మికులను ఉత్సాహపరచడంతోపాటు స్ఫూర్తిమంతంగా నిలిచాడు. శ్రీనివాసరావు చొరవను పలువురు అభినందిస్తున్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -పద్మనాభం : టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు కోరాడ రమణ పిలుపునిచ్చారు శుక్రవారం పద్మనాభం జంక్షన్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో బూత్ కన్వీనర్లు, పార్టీ గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలకు శుక్రవారం కిట్లు పంపిణీ చేశారు. ఐదురోజుల్లో ఇంటింటా అందజేసి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కె. దామోదరరావు, టిడిపి మండల అధ్యక్షులు నగేష్‌కుమార్, ఎం.నందీశ్వర్, పైడినాయుడు, పి.శ్రీను, కె.ఎర్రినాయుడు పాల్గొన్నారు.

లలితాదేవికి బంగారు చీర అలంకరణ

ప్రజాశక్తి- సీతమ్మధార : శ్రీలలితాపీఠం 75వ వార్షికోత్సవం సందర్భంగా లలితాదేవి అమ్మవారికి 2 కిలోల బంగారంతో చేయించిన చీరను కుర్తాళం పీఠాధిపతి జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆవిష్కరించి, అమ్మవారికి అలంకరించారు. భక్తులు, దాతల సహకారంతో ఈ బంగారు చీర చేయించినట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి, కుర్తాళం పురోహితులు మాచవోలు రమేష్‌శర్మ, చిట్టిబాబు పాల్గొన్నారు.

త్వరితగతిన స్పందన సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి -పాడేరు : జగనన్నకు చెబుదాం స్పందన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ భావనా విశిష్ట, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్‌లతో కలసి స్పందనలో 110 వినతులను స్వీకరించారు. రహదారులు, తాగునీటి సమస్యలపై వినతులు ఎక్కువగా రాగా, సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు డిఆర్‌ఒ లక్ష్మణమూర్తి, ఎస్‌డిసిలు వివి.ఎస్.శర్మ, భవానీ, ఇఇలు రాజు, కె.వేణుగోపాల్, డిపిఒ కొండలరావు, డిఎల్‌పిఒ. పిఎస్.కుమార్, ఎల్‌డిఎం. ఎన్.రవితేజ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో గిరిజనులందరికి అందుబాటులో వైద్యం అందుతుందని కండ్రుం పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కేహరి చెప్పారు. శుక్రవారం కండ్రుంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, వైద్య నిపుణులు విజయ్ కుమార్, స్థానిక వైద్యాధికారి పి రాంబాబు, అంబిక పాల్గొన్నారు.

హరిత పెట్టుబడులకు అపార అవకాశాలు

గీతం బిజినెస్ స్కూల్ సదస్సులో నిపుణులు

ప్రజాశక్తి- మధురవాడ : కోవిడ్ తర్వాత ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణానికి, సుస్థిర అభివృద్ధికి హరిత టెక్నాలజీలకు ప్రాధాన్యత పెరిగిందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో సుస్థిర ఆర్థిక ప్రగతికి ఫిన్ పోజియం 1.0 పేరిట నిర్వహించిన సదస్సులో ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా మాజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఈమంది శంకరరావు మాట్లాడుతూ హరిత పెట్టుబడులకు అపార అవకాశాలు ఏర్పడుతున్నాయన్నారు. వాణిజ్య రంగంలో హరిత సాంకేతిక పరిజ్ఞానానికి, సంప్రదాయేతర ఇందన వనరుల ఉత్పాదక రంగంలో పెట్టుబడులు ప్రోత్సాహకరంగా ఉన్నాయన్నారు. గ్రీన్ బాండ్, కార్బన్ ట్రేడింగ్‌లకు కేంద్రప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో రూ.11.11లక్షల కోట్లను హరిత ఆర్థిక కార్యకలాపాలకు కేటాయించిందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా. పి.పప్పు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫైనాన్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ షీలా, ఆర్థిక నిపుణులు రాజేష్ సింగ్, కృష్ణకిషోర్, ఎస్.భార్గవ, వేదుల శ్రీధర్, వివిఆర్ రవీంద్ర, ఎమ్.విజయ్‌కిట్టు, ఎస్.శివకుమార్, ఎస్.ఎస్. శశిరేఖ, ఎస్.ఆదిత్యకుమార్ కోఆర్డినేటర్‌లు కె.మధు కిషోర్, డాక్టర్ సిద్దార్థ పాల్గొన్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ శంకరరావు

ఔషధ గుణాలున్న మొక్కలు నాటివేత

ప్రజాశక్తి -ఆనందపురం: నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటి) కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కణమాంలో వారం రోజులపాటు ప్రత్యేక సేవా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి హరిగోపాల్ తెలిపారు. మొదటి రోజు శుక్రవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఔషధ గుణాలు, ఫలాలిచ్చే మొక్కలను నాటారు. మొక్కలు, నాటి సంరక్షించడంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కాలేజీ యాజమాన్యం, ప్రిన్సిపల్ డాక్టర్ శంభుప్రసాద్, డైరెక్టర్ రాజమురుగుదాస్, ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులను స్థానిక సర్పంచ్ ఆబోతు అప్పలరాము, గ్రామస్తులు అభినందించారు.

అడుగడుగునా సమస్యల దర్శనం

ప్రజాశక్తి -పద్మనాభం: గ్రామగ్రామానా అపారిశుధ్యం, ఇతరత్రా సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని జనసేన భీమిలి ఇన్చార్జ్ పంచకర్ల సందీప్ మండిపడ్డారు. శుక్రవారం. మండలంలోని చిన్నాపురం, విజయానందపురం, తునివలస, నరసాపురం, పొట్లూరు, రెడ్డిపల్లి, సుంకర పేట, దూపేట, కోరాడ గద్దపేట గ్రామాల్లో జనంతో జనసేన కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను సేకరించంఆరు. శుక్రవారం రాత్రి గద్దపేట గ్రామంలో రాత్రి బస చేశారు.

టిడ్కో ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 45వ వార్డు ఎఎస్‌ఆర్ నగర్‌లో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ కంపా హనోక్ ఆధ్వర్యంలోఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె రాజురిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు పైడి రమణ, ఎపిడి పద్మావతి, నాయకులు హరిపట్నాయక్, ఆదిలక్ష్మి, నాయుడు, నేపాల్ శ్రీను, సన్నీ, బాబూరావు, దుర్గా, గణపతి, మాతేసు, సతీష్, పైడి నాగరాజు, నరసరావు పాల్గొన్నారు

బిఎస్ఎన్ఎల్‌తో 'లెండి' కాలేజీ ఎంఒయు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : లెండి కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (విశాఖపట్నం) మధ్య టెలికమ్యూనికేషన్ సాంకేతికతపై అవగాహన కుదిరింది. శుక్రవారం ఈ రెండు సంస్థలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ మేనేజర్ డాక్టర్ ఎం.సత్యప్రసాద్ హాజరై 'ఎమర్జింగ్ వైర్లెస్ టెక్నాలజీ ఇన్ టెలికాం సెక్టార్' అంశంపై ప్రసంగించారు. అనంతరం ఈసిఈ విభాగాధిపతి డిఎం.రాజన్‌బాబు మాట్లాడుతూ, టెలీకమ్యూనికేషన్ రంగంలో ఆవిష్కరణలు పెంపొందించుటకు కళాశాల యాజమాన్యం, బిఎస్ఎన్ఎల్ చేపట్టబోతున్న కార్యక్రమాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి.రామరెడ్డి, డాక్టర్ ఎం.రాజన్ బాబు, డాక్టర్ ఎస్.శ్రీధర్, డాక్టర్ బి.శ్రీధర్, డాక్టర్ ఎవి.పరాంకుశం, డాక్టర్ డి.నరేష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిష్టకరణ ప్రముఖులకు సత్కారం

ప్రజాశక్తి- పిఎం.పాలెం: ప్రజా ప్రయోజనాన్ని కాంక్షిస్తూ వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న శిష్టకరణ ప్రముఖులను ఎపి శిష్టకరణ సంఘం అసోసియేట్ అధ్యక్షులు డొంకాడ అనిల్‌కుమార్ శుక్రవారం ఘనంగా సత్కరించారు. తన నివాసంలో శిష్టకరణ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్, ప్రధాన కార్యదర్శి ఆరికతోట చంద్రమౌళి, మహిళా విభాగం కార్యదర్శి మండవకురిటి లక్ష్మిలను సన్మానించారు. సత్కారగ్రహీతల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు డొంకాడ వసంత, పి దుర్గాదేవి భవాని, పి సతీపార్వతి పాల్గొన్నారు.

ఓటే యువతకు ఆయుధం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: తొలిసారి ఓటు హక్కు పొందిన యువత, రానున్న ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని మాజీ ఎమ్మెల్యే, పాడేరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి కోరారు. శుక్రవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు కుమ్మరిపుట్టులోని తన నివాసంలో స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసిపి పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని, యువత ఓటును ఆయుధంగా మలచుకుని ప్రస్తుత పాలకులకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌టి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమేలి చిట్టిబాబు, లగిసపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ పాల్గొన్నారు.

కాలినడకన అప్పన్న దర్శనానికి ..

ప్రజాశక్తి -గోపాలపట్నం/ పెందుర్తి : సింహాద్రి అప్పన్నను పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు కుటుంబసభ్యులతో శుక్రవారం కాలినడక వెళ్లి దర్శించుకున్నారు. తన తండ్రి మాజీ ఎంపీ స్వర్గీయ అప్పల నరసింహం నుంచి ఆనవాయితీగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని గణబాబు కొనసాగించి, అప్పన్నను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్లు బొమ్మిడి రమణ, దాడి వెంకటరమేష్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

ఆకాశవాణి సీనియర్ అనౌన్సర్‌కు అభినందన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చిట్టి పదాలతో లోతైన భావ వ్యక్తీకరణ ఆవిష్కరించడం డాక్టర్ బండి సత్యనారాయణ ప్రత్యేకత అని ఆకాశవాణి కార్యక్రమ విభాగాధిపతి పివి.రాం గోపాల్ అన్నారు. 36వ ఉమ్మిడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డును బండి సత్యనారాయణకు ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ప్రాంగణంలో ఆయన్ను అభినందించారు. కార్యనిర్వహక అధికారులు ఇందిర, సంఘమిత్ర, సుధాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టి.దిలీప్‌కుమార్ రెడ్డి, ఎం.వెంకటరమణ, ప్రియాంక, జిఆర్ఆర్ఎస్వి, ప్రసాద్, శివరాంప్రసాద్ పాల్గొన్నారు. తనను సత్కరించిన ఆకాశవాణి సిబ్బందికి డాక్టర్ బండి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

1107వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించాలని, లేకుంటే సెయిల్‌లో విలీనం చేయాలని ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ డిమాండ్‌చేశారు. శుక్రవారం కూర్మన్నపాలెం వద్ద 1107 రోజు దీక్షా శిబిరంలో టిపిపి, ఆర్ఇడిపిఇఎం, స్టోర్స్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రాణత్యాగాలతో సాధించుకున్న ఉక్కును ప్రయివేటీకరిస్తే చూస్తూ ఊరుకోబోమని, ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లోని ఏకైక పెద్ద కర్మాగారం, విశాఖ ఉక్కును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

వాలంటీర్లకు సేవా అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి -అనకాపల్లి : మండలంలోని తుమ్మపాలలో గ్రామ వాలంటీర్ల వందనంలో ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవ మిత్ర అవార్డులతో ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైసిపి ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ: పుత్తడిగైరంపేట గ్రామంలో శుక్రవారం వాలంటీర్లకు వందనంలో వాలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సర్పంచ్ పత్తి రమణ, ఎంపిటిసి యల్ల లక్ష్మీదుర్గనాయుడు, ఉపసర్పంచ్ పత్తి రాజుబాబు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, సచివాలయ కార్యదర్శి మర్రి రాజబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన లిప్ బృందం

ప్రజాశక్తి- సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను లిప్ బృందం శుక్రవారం సందర్శించింది. స్టేట్ అబ్జర్వర్ భారతి లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ కార్యక్రమం 6, 7, 8 తరగతులలో అమలవుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను తరగతులలో పరిశీలించి చక్కని పని తీరును ప్రదర్శించిన ఇంగ్లీషు, సైన్స్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులను అభినందించారు. శ్రీకాకుళం డైట్ అధ్యాపకులు త్రినాథరావు, ఎస్ఈఆర్‌టి రామనాథం, ఎంఇఒ-1 లక్ష్మణరావు, హెచ్‌ఎం ఎస్. తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి తీర్థం

ప్రజాశక్తి-సబ్బవరం : ఆదిరెడ్డిపాలెం గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామి, గణపతి, సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సబ్బవరం-2 ఎంపిటిసి బైలపూడి దేముడు బాబు, నాయకులు గొంప దేముడు, కొటాన కోటయ్య, కోటాన అప్పారావు, బైలపూడి సత్యం, మడ్డు సూర్యనారాయణ, గొర్లి కనకం, కోటాన దేముడుబాబు, కోటాన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మోదకొండమ్మ తీర్థం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : 27న జరగనున్న మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం పోస్టర్‌ను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శుక్రవారం తారువలో ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజు, సభ్యులు దంగేటి సూర్యారావు, సభ్యులు తెలిపారు.

230 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : జై శ్రీ కృష్ణ ఆసుపత్రి హాస్పటల్ 20వ వార్షికోత్సవం సందర్భంగా అచ్యుతాపురంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 230 మంది రోగులకు వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.వైద్యులు గొర్లి దామోదర్, ఎస్ సురేష్, లీలబాయ్, ఎ.సుధీర్ వైద్య సేవలు అందించారు

సామాజిక అంశాలపై యువత దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి -గాజువాక : సామాజిక సేవపై నేటి యువత దృష్టి పెట్టాలని పల్లా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పల్లా కార్తీక్ అన్నారు. శుక్రవారంకొత్త గాజువాక హైస్కూలు ఆవరణలో ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఓటు హక్కును బాధ్యతగా పొందాలన్నారు.నడవడిక, మాట తీరు, సాయం చేసే గుణం పెంచుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్.ప్రోగ్రామ్ ఆఫీసర్ కె శివలక్ష్మి, ప్రిన్సిపల్ పి ప్రదీప్ కుమార్, ఎం సత్యప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్‌విఆర్ పాత్రుడు, ఎస్ శ్రీను, క్యాంపస్ ఇంచార్జ్ బివిపివి నరసింహమూర్తి, హెచ్‌ఎం కెవి ప్రశాంతి పాల్గొన్నారు హైస్కూలు ప్రాంగణంలో శుభ్రత కార్యక్రమం చేపట్టారు.